సాక్షి
చిత్తూరు
మంగళవారం ၊ 13 ၊ ఆగస్టు ၊ 2024



నీట మునిగిన నగరి

ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో నగరి పట్టణం నీటమునిగింది. కార్యాలయాలు జలమయంగా మారాయి. - 8లో



పోలీస్ గ్రీవెన్స్‌కు 50 అర్జీలు

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్‌కు 50 వినతులు రాగా, ఎస్పీ మణికంఠ స్వీకరించారు. - 8లో



అర్జీల పరిష్కారంలో..

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

పల్లెల్లో జెండా పండుగకు నిధులు

చిత్తూరు కార్పొరేషన్: స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు రూ.10వేల నుంచి 25 వేల వరకు సాధారణ నిధుల నుంచి వాడుకునేలా ఉత్తర్వులు వచ్చినట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. 5 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10వేలు, 5వేల కంటే ఎక్కువగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 వేల వరకు వాడుకోవచ్చన్నారు. జిల్లాలో 5 వేల వరకు జనాభా ఉన్న పంచాయతీలు 670, 5 వేల మందికిపైగా జనాభా ఉన్న పంచాయతీలు 26 ఉన్నట్లు వివరించారు.

యథాస్థానాలకు తిరిగొచ్చిన ఎంపీడీఓలు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల నేపథ్యంలో పక్క జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీఓలు తిరిగి ఉమ్మడి జిల్లాకు వచ్చారు. వారిని పాత స్థానాల్లో నియమిస్తూ జెడ్పీ గ్లోరియా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఐరాల మండలానికి నాగరాజ, నిమ్మనపల్లెకు శేషగిరిరావు, గుడుపల్లెకు ఎస్.తాజ్‌మసూర్, నింద్రకు అరుణ, పాకాలకు ప్రభాకర్, వడమాలపేటకు భానుమూర్తిరావు, తొట్టంబేడుకు సురేష్ బాబు, వి.కోటకు చంద్రమౌళి, పీటీఎంకు బాలాజీ, చంద్రగిరికి బాలాజీనాయక్, ఎర్రావారిపాళ్యానికి అమరనాథ్, వాయల్పాడుకు మనోహరరాజు, తవణంపల్లెకు అబ్దుల్‌కలామ్ ఆజాద్, నగరికి లీలామాధవి, పెనుమూరుకు నీలకంఠేశ్వరరెడ్డి, యాదమరికి శివరాజు, కేవీబీపురానికి రామచంద్ర, బీఎన్‌కండ్రిగకు సాయిలహరి బాధ్యతలు చేపట్టనున్నారు.

పోలీసు శాఖలో కారుణ్య నియామకాలు



నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేస్తూ అనారోగ్యంతో జె.పట్టాభి మృతి చెందగా, ఆయన సతీమణి బి.గీతకు కారుణ్య నియామకం కింద సీ కేటగిరి ఉద్యోగం కల్పిస్తూ ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఆమెకు సీ కేటగిరిలో ఉద్యోగం కల్పించారు. ఎస్పీ వెంట ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, హోంగార్డు ఆర్‌ఐ సుధాకర్ ఉన్నారు.

రోడ్డు పనులకు నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: రహదారుల విస్తరణ, నిర్మాణంలో ఉన్న రోడ్డును పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎన్‌హెచ్‌ఏఐ, ఎంఓఆర్‌టీహెచ్ ఆధ్వర్యంలో పలు రోడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. మదనపల్లె-పుంగనూరు-పలమనేరు రోడ్డు డబులు లైన్‌గా విస్తరణ పనులను 2016లో రూ.378 కోట్లతో ప్రారంభించారు. ఇందులో రూ.353 కోట్ల పనులు జరిగాయి. మిగిలిన పనులకు రూ.15 కోట్లు ఇచ్చారు. వి.కోట-బైరెడ్డిపల్లె మధ్య బైపాస్‌రోడ్డు ఏర్పాటుతో పాటు ఈ రోడ్డును పలమనేరు-కృష్ణగిరి రోడ్డుకు అనుసంధానం చేసే మార్గానికి రూ.70 కోట్లు కేటాయించారు. పలమనేరు-కృష్ణగిరి హైవేను రెండు వరుసల విస్తరణ పనులను 2015లో రూ.271 కోట్ల అంచనాతో చేపట్టారు. ఇప్పటి వరకు రూ.243 కోట్లు పనులు చేయగా పెండింగ్ పనుల కోసం రూ.10 కోట్లు కేటాయించారు. పుంగనూరు టౌన్‌లో బైపాస్‌రోడ్డుకు రూ.15 కోట్లు కేటాయించారు. పూతలపట్టు వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.76 లక్షలు మంజూరు చేశారు.

కాణిపాకం ఈఓ బదిలీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఈఓ వెంకటేశ్వర్లును సోమవారం బదిలీచేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయనను విజయవాడలోని సాధారణ పరిపాలన శాఖకు బదిలీ చేశారు. ఈయన రెండు రోజుల్లో రిలీవ్ కానున్నట్లు సమాచారం. ఈ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

16 లోపు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉచిత డీఎస్సీ శిక్షణకు సంబంధిత గిరిజన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని గిరిజన యువత ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు చిత్తూరు కలెక్టరేట్‌లో ఈ నెల 16వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 08572-241056ను సంప్రదించాలని ఆయన కోరారు.

సర్కారు వారి ఆట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే
జూదం దందా మొదలైంది.
ఈ ఆటలో తమ్ముళ్లు లోపల పెత్తనం చెలాయిస్తుంటే,
పోలీసులు బయట కాపలా కాస్తుండడం
విమర్శలకు దారితీస్తోంది.
అధికార పార్టీ నేతలు తమ బంధువులకు
చిత్తూరు నుంచి కుప్పం వరకు
ఆయా ప్రాంతాలను పంచేయడంతో
పేకాట ఊపందుకుంది. ఈ శిబిరాల్లో నిత్యం
రూ.కోట్లాది రూపాయలు చేతులు మారుతోంది.
ఈ జూద కేంద్రాల్లో ప్రధానంగా బిలియనీర్లను బిచ్చగాళ్లుగా
మార్చే లోపల బయట ఆట నిరాటంకంగా కొనసాగుతోంది.
దీనికి తోడు శిబిరాల్లో వడ్డీ వ్యాపారం మొదలైంది.
ఈ జూదానికి వ్యసనంగా మారిన
సామాన్యుడి కుటుంబం రోడ్డున పడుతోంది.



పేకాట.. కోట్లాట!

- తమ్ముళ్లే 'రాజా'లు.. ఖాకీలే 'జాకీలు'
- జిల్లాలో మొదలైన జూదం వ్యాపారం
- ఏరియాలు పంచుకున్న టీడీపీ నేతలు
- అధికార పార్టీ నేతలకు, పోలీసులకు పర్సంటేజీలు
- చిత్తూరు నుంచి కుప్పం వరకు సాగుతున్న వైనం
- రోజుకు రూ.2 కోట్ల లావాదేవీలు

చిత్తూరు అర్బన్: జిల్లాలో గత 50 రోజులుగా జరుగుతున్న పేకాట క్లబ్‌లకు కొందరు జిల్లా టీడీపీ నేతలు 'ఇస్పేట్ ఆసు'ల్లా అండగా నిలబడ్డారు. ఆయా నియోజకవర్గాల్లోని పలువురు అధికార పార్టీ నేతలు 'ఆటిన్ రాజా'ల్లా అండగా నిలబడితే.. ఈ వ్యాపారం 'డైమండ్ రాణి'లా దర్జాగా కొనసాగుతోంది. వీళ్లకు మధ్యవర్తిగా ఉంటూ వచ్చినంత వరకు దండుకుంటూ అనుమతులిస్తున్న కొందరు ఖాకీలు 'కళావర్ జాకీ' లెక్క కాపుకాస్తుంటే.. జేబులోని డబ్బులు పోగొట్టుకుని వ్యసనపరులు 'జోకర్'గా రోడ్డున పడుతున్నారు.

'లోపల' టీడీపీ నేతలు

పేకాటలో ఎన్నో రకాల ఆటలున్నప్పటికీ నిమిషాల వ్యవధిలో కోటీశ్వరుడ్ని బిచ్చగాడిగా మార్చేది, బిచ్చగాడిని బిలియనీర్ చేసేది మాత్రం 'లోపల-బయట' ఆటే. ఒక్కసారి ఈ ఆట లోపల చిక్కుకున్న వాళ్లు బయట పడడం అంత సులభం కాదు. ఈ వ్యసనానికి లోనైతే ఇంట్లో వస్తువుల నుంచి భార్య మెడలోని మంగళసూత్రం వరకు తీసుకొచ్చి జూదంలో ఒడ్డుతుంటారు. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని, రాజకీయ పలుకుబడి వున్న వ్యక్తులు 'లోపల-బయట' ఆటను నిర్వహించడం, కొన్ని చోట్ల ఆసక్తివున్న వాళ్లకు అనుమతులు ఇవ్వడం చేస్తుంటారు. ఇలా అనుమతులు ఇస్తున్నందుకు రోజుకు పెద్ద మొత్తంలోనే నేతలకు ముడుతోంది. జిల్లాలో ప్రస్తుతం ఈ ఆట అధికార పార్టీకి చెందిన పలువురు కూటమి నాయకుల స్వీయ పర్యవేక్షణలో జరుగుతోంది. చిత్తూరు, పలమనేరులో ఓ మోస్తరుగా జరుగుతున్న ఈ జూదం.. పుంగనూరులో విచ్చలవిడిగా సాగుతోంది. కుప్పంలో జరుగుతున్న పేకాట శిబిరాలకు కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో వ్యసనపరులు వస్తున్నారు. గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో ఇపుడిప్పుడే ఆట మొదలైతే, పూతలపట్టు నియోజకవర్గంలో మాత్రం పేకాట ద్వారా పెద్ద ఎత్తున నగదు చేతులు మారుతోంది.

'బయట' పోలీసులు

ప్రతీ రోజూ ఉదయం చిత్తూరు ఎస్పీ మణికంఠ జిల్లాలోని పోలీసు అధికారులతో సెట్ కాన్ఫరెన్సు నిర్వహిస్తుంటారు. ఇందులో మొదటగా ఆయన చెప్పే అంశం.. జిల్లాలో ఎక్కడా జూదం, లాటరీ, మట్కా లాంటివి జరగకూడదని చెబుతుంటారు. దీన్ని నడిపించేవాళ్లు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని పదే పదే చెబుతుంటారు. ఇది చాలదన్నట్టు నెలకోసారి నిర్వహించే క్రైమ్ మీటింగ్‌లోనూ ఈ అంశంపై పోలీసులను గట్టిగానే హెచ్చరిస్తుంటారు. సామాన్యుల రక్తాన్ని పీల్చేసి, కుటుంబాలను రోడ్డున పడేస్తున్న జూదంలో ఎవరైనా పోలీసుల హస్తం ఉన్నట్లు తేలితే వదిలేదని గట్టిగానే చెబుతారు. కానీ చిత్తూరు నుంచి కుప్పం వరకు జరుగుతున్న అనధికార పేకాట శిబిరాలు చాలా వరకు పోలీసు కనుసన్నల్లోనే నిర్వహిస్తున్నారనే అపవాదు మాత్రం తొలగడంలేదు. కొన్నిచోట్ల కూటమి నేతల మాట కాదనలేక మొహమాటంతో ఈ క్రీడను చూసీచూడనట్లు పోలీసులు వదిలేస్తున్నారు. మరికొన్నిచోట్ల మాత్రం నెలసరి మామూళ్లు తీసుకునే కొందరు పోలీసులు మిన్నకుండిపోతున్నారనే విమర్శలున్నాయి. ఈ మొత్తం ప్రక్రియ తెలిసి కూడా మౌనం వహిస్తున్నవాళ్లు స్పెషల్ బ్రాంచ్ సిబ్బందేనని తోటి పోలీసులే కోడై కూస్తున్నారు.



చిత్తూరులో జూదరుల అరెస్టు చూపుతున్న పోలీసులు (ఫైల్)

శిబిరాల్లోనే వడ్డీ వ్యాపారం..


పేకాట ఓవైపు ముమ్మరంగా సాగుతుంటే, మరోవైపు ఇక్కడ వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి ఫైనాన్స్ ఇవ్వడానికి అక్కడికక్కడే కొందరు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల నగదుతో సిద్ధంగా ఉంటారు. ఉదయం రూ.లక్ష ఇస్తే సాయంత్రంలోపు రూ.1.20 లక్షలుగా ఇచ్చేయాలన్న నిబంధనలతో చిత్తూరు పరిసరాల్లో ఓ ముఠా వడ్డీ వ్యాపారాలు చేస్తోంది. ఈ ముఠాకు ఇక్కడి కూటమిలోని ఓ ప్రధాన నాయకుడి బలమున్నట్లు ప్రచారం ఉంది. జిల్లా వ్యాప్తంగా రోజుకు దాదాపు రూ.2 కోట్ల లావాదేవీలు ఒక్క పేకాటలోనే జరుగుతుంటే ఇందులో టీడీపీ నేతలకు 20 శాతం, పోలీసులకు 10 శాతం రోజువారీ మామూళ్లు ముడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎవరి అడ్డా వాళ్లది

- రిక్రియేషన్ క్లబ్‌ల పేరిట చిత్తూరు నగరంలో రెండు చోట్ల జరుగుతున్న పేకాట క్లబ్బుల్లో నిషేధిత 'లోపల-బయట' ఆట సాగుతోంది. చిత్తూరు మండలం, తుమ్మింద, చెర్లోపల్లె, ప్రాంతాలతో పాటు గంగనపల్లెలో రెండుగా చీలిన టీడీపీ వర్గాలు వేర్వేరు క్లబ్బులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో గుడిపాలలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఓ యువ కూటమి నేతకు అనుమతి ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. కొంగారెడ్డిపల్లెకు చెందిన మరో యువ టీడీపీ నాయకుడు తన వాళ్లకు అనుమతి ఇవ్వాలని పట్టుబడుతున్నాడు. దీంతో రెండు వర్గాల మధ్య కోల్డ్‌వార్ జరుగుతోంది.
- పుంగనూరు నియోజకవర్గం బోయకొండ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో పెద్ద ఎత్తున పేకాట సాగుతోంది. నక్కగుంట, మాగాండ్లపల్లె-గుడుపల్లె రోడ్డు, చంద్రమాకులపల్లె, మంగళం-రాయలచెరువు ప్రాంతాల వద్ద విచ్చలవిడిగా లోపల-బయట జూదం సాగుతోంది. ఇదే నియోజకవర్గానికి చెందిన కూటమి నేత ప్రధాన అనుచరుడు ఈ శిబిరాలను పర్యవేక్షిస్తున్నాడు.
- పలమనేరు నియోజకవర్గం వేలుపల్లె, కౌండిన్య అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న పేకాటలో ఓ పోలీసు అధికారి ప్రమేయం ప్రత్యక్షంగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి.
- కుప్పం నియోజకవర్గం గుడివంక, శాంతిపురం-కర్ణాటక సరిహద్దుల్లో జరుగుతున్న పేకాటకు రెండు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో జనం వస్తున్నా, అడిగే దిక్కులేదు.
- పూతలపట్టు నియోజకవర్గంలోని యాదమరి, బంగారుపాళ్యం-తుంబకుప్పం ప్రాంతాల్లో రోజుకు రూ.30 లక్షల వరకు లావాదేవీలు పేకాట ద్వారా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అరగొండ రోడ్డులో చిత్తూరుకు చెందిన ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో జూదం ఆడిస్తున్నారు.
- నగరిలో తడుకుపేట-తమిళనాడు సరిహద్దుల్లోని నిర్మానుష్య ప్రాంతంలో ఇప్పుడిప్పుడే మొదలైన పేకాటను ఓ మండలస్థాయి టీడీపీ నేత స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గంగాధర నెల్లూరు -నెల్లేపల్లె మార్గం, పెనుమూరు మండలంలోని ఓ మామిడి తోటలో రహస్యంగా జరుగుతున్న పేకాటలో రోజుకు రూ.లక్ష వరకు పోగొట్టుకుంటున్నట్లు తెలిసింది.

నాయుడు భలే గట్టోడే!

- మాదిగ బండక్వారీ జనార్దన నాయుడిదే కాదట
- రికార్డుల్లో ఉన్న లీజుదారు శరత్‌కుమార్
- ఏకంగా చంద్రబాబునే బురిడీ కొట్టించిన వైనం
- కూటమి అధికారంలోకి రాగానే క్వారీపై పెత్తనం
- ఒకే ఆధార్ నెంబరుతో రెండు రాష్ట్రాల్లో కార్డులు



పలమనేరు మండలం మాదిగబండ వద్ద జనార్దన్ నాయుడు స్వాధీనం చేసుకున్న క్వారీ ఇదే

సాక్షి టాస్క్‌ఫోర్స్: పలమనేరు ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబు మాట్లాడుతూ పాపం కర్ణాటక నుంచి ఇక్కడి కొచ్చి మెటల్ స్టోన్ క్రషింగ్ చేసుకుంటున్న జనార్దన నాయుడిని బెదిరించి దాన్ని కొట్టేశారని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఆయన జిల్లాలో పలుచోట్ల ఎన్నికల ప్రచారాల్లో మాట్లాడారు. జనార్దన నాయుడుకు ఇంత అన్యాయం జరిగిందా అనుకున్నారుగానీ ఇప్పుడు చూస్తే అసలు ఆ క్వారీకి లీజుదారుడు జనార్దన్ నాయుడే కాదు. చిత్తూరు జిల్లా వి.కోట మండలానికి చెందిన శరత్‌కుమార్‌దిగా ఇక్కడి మైనింగ్ రికార్డుల్లో ఉంది. ఇన్నాళ్లు చంద్రబాబునే బురిడీ కొట్టించిన జనార్దన్ నాయుడు భలే వాడుగా ఉండాడే అంటూ ఇక్కడి జనం చర్చించుకుంటున్నారు. కూటమి అధికారంలోకి రాగానే మాదిగబండ క్వారీని నాయుడు స్వాధీనం చేసుకుని తమ ప్రభుత్వం అధికారంలో ఉందని అధికారులను సైతం బెదిరించుకుంటూ జల్లి(కంకర)పనులు యథేచ్ఛగా చేస్తున్నాడు. నాయుడు కర్ణాటకలో బీజేపీ నాయకుడు, ఇక్కడేమో టీడీపీ లీడర్‌గా చలమాణి అవుతున్నాడు.

ఆపరేటర్ మృతితో విషయం వెలుగులోకి...

మూడు రోజుల క్రితం మాదిగబండ క్వారీలో ఓ జేసీబీ ఆపరేటర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. దీనిపై స్పందించిన ఇక్కడి వైఎస్సార్‌సీపీ నేతలు మృతుని కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో క్వారీకి సంబంధించిన అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2021లో ఇక్కడి క్వారీకి లీజుదారుగా ఉన్న జి.మోహన్‌బాబు తన క్వారీని శరత్‌కుమార్‌కు బదిలీ చేశారు. ఇందుకు సంబంధించిన స్థానిక మైనింగ్ శాఖలో ప్రొసీడింగ్స్ నెం:1059/టీక్యూఎల్/ఆర్ఎంబీఎస్/21 గా ఉంది. దీంతో శరత్‌కుమార్ లీజుదారుగా మారాడు. క్వారీకి సంబంధించి హెచ్‌టీ సర్వీస్ నెం:2503 పేరిట తీసుకున్నాడు. అయితే ఇదే క్వారీ ఇన్ ఎలిజిబుల్ జాబితాలో ఉందంటూ 2022 ఆగస్టు 1న మైనింగ్ డీడీ కేవీవీ ప్రసాద్‌రావు లీజుదారుడైన శరత్‌కుమార్‌కు ప్రొసీడింగ్స్ నెం:3522/క్యూ1గా నోటీసు జారీ చేశారు. దీంతో ఈ క్వారీ పనులు ఆగిపోయాయి. అనవసరంగా కరెంట్ చార్జీలు భారమెందుకు అనుకుని, 2024 జూన్ 6న స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు అప్పటిదాకా ఉన్న బకాయిలను చెల్లించి సర్వీసును డీసీ చేయమని ట్రాన్స్‌కో ఎస్ఈ(ఆపరేషన్)కు అర్జీ ఇచ్చాడు. దీన్ని బట్టి చూస్తే ఈ క్వారీ జనార్దన్‌నాయుడిది కాదు శరత్‌కుమార్‌దని తేలిపోయింది.

నోరుమెదపని అధికారులు

అనర్హత జాబితాలోకి వచ్చిన మాదిగబండ క్వారీని స్థానిక మైనింగ్ అధికారులు ఎందుకు ఆపలేదో అర్థం కాలేదు. తనకు కరెంట్ వద్దని విన్నవించిన లీజ్‌దారుని కాదని ఇన్ని నెలలుగా ట్రాన్స్‌కో అధికారులు ఎలా సరఫరా ఇస్తున్నారో చెప్పడం లేదు. దీనిపై వారిని వివరణ కోరినా దాటవేసే ప్రయత్నం చేయడం గమనార్హం.

కూటమి అధికారంలోకి రాగానే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జనార్దన్‌నాయుడు తన మనుషులతో వచ్చి మాదిగబండ క్వారీని స్వాధీనం చేసుకున్నాడు. అప్పటికే అక్కడున్న జల్లిని సైతం కర్ణాటకకు తరలించుకున్నాడు. దీనిపై లీజుదారుడైన శరత్‌కుమార్ జూన్ 16న స్థానిక సీఐకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ అధికారబలంతో నాయుడు రెచ్చిపోయి క్వారీవద్దకు ఎవరినీ రానీయకుండా స్టోన్‌క్రషింగ్ చేస్తున్నాడు.

పంచాయతీకి సెస్‌లు కూడా లేవట

కొలమాసనపల్లి పంచాయతీ సర్పంచ్ గోవిందుస్వామి సోమవారం స్థానిక మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ అక్రమంగా మైనింగ్ చేస్తున్న జనార్దన్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. పైగా పంచాయతీ పన్నులను వసూలు చేయించాలని విన్నవించారు.

ఒకే నెంబరుతో రెండు ఆధార్ కార్డులు

జనార్దన్‌నాయుడు 9041 1852 3636 అనే నంబరుతో దొడ్డ కంబలి, బంగారుపేట తాలుకా, కర్ణాటక పేరిట ఆధార్ కార్డు ఉంది. ఇదే నంబరుపై కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం కెనమాకులపల్లిలోనూ ఆధార్ కార్డు కలిగి ఉన్నట్టు ఇక్కడి వైఎస్సార్‌సీపీ నేతలు బయటపెట్టారు. దీనిపై కలెక్టర్ విచారణ చేపట్టాలని విన్నవించారు.

దేశభక్తి ఉప్పొంగేలా 'హర్ ఘర్ తిరంగా'

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి భారతీయునిలో దేశభక్తి పెంపొందించేలా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో హర్ ఘర్ తిరంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను సమగ్రతను కాపాడడం మనందరి బాధ్యత అని అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12 నుంచి 15 వరకు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వాములు కావాలని తెలిపారు. దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిరుద్యోగుల
కడుపుకొట్టొద్దు

- స్వయం సహాయక సంఘాల మహిళల నిరసన



వెలుగు ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

చౌడేపల్లె: రాజకీయ కుట్రలతో చిరు ఉద్యోగుల కడుపు కొట్టవద్దంటూ సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర తెలిపారు. ఆయన సోమవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయం ఎదుట ఏ.కొత్తకోట పంచాయతీకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా సంఘమిత్రలుగా ఉన్న నాగరత్న, సుహాసిని సమర్థవంతంగా విధులు నిర్వరించారని చెప్పారు. రాజకీయ కుట్రలతో ఇద్దరినీ తొలగించడం దారుణమని సభ్యులు వాపోయారు. అనంతరం వారిద్దరినీ వీఓఏలుగా కొనసాగించాలంటూ ఏపీఎం నర్సోత్తమరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

పోలీసు గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో 50 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ ఆరీఫుల్లా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో బైక్ చోరీ, మోసం, కుటుంబ తగాదాలు, వేధింపులు, ఆర్థిక లావాదేవీలు, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ఎస్పీ మాట్లాడుతూ ప్రతీవారం గ్రీవెన్స్‌డేలో వచ్చే ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ నేపట్టి, ఏ మేరకు సమస్య పరిష్కారమయ్యిందో నివేదిక ఇవ్వాలన్నారు.

దుకాణానికి నిప్పు పెట్టిన వారిని అరెస్టు చేయాలి


చెప్పుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కృష్ణమూర్తి

బైరెడ్డిపల్లె : చెప్పుల దుకాణానికి నిప్పు పెట్టిన నిందితుల్ని వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. అగ్నికి ఆహుతి అయిన చెప్పుల దుకాణాన్ని సోమవారం ఉదయం ఆయన పరిశీలించి దుకాణ యజమాని నవాబ్ కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. రహదారి పక్కనే చెప్పులు అమ్ముకుంటూ జీవనం సాగించే నవాబ్ కుటుంబంపై కక్షసాధింపులకు దిగడం దారుణమన్నారు. నవాబ్‌కు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు రమణారెడ్డి, పైజుల్లా, కేశవులు, కార్తిక్, శేషగౌడు, వెంకటేష్, సుబ్రమణ్యం, బాబు, సుధాకర్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో మహిళ

పెద్దపంజాణి: సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు సరికొత్త మార్గంలో మహిళలకు వలవేసి దొరికినంత దోచేసుకుంటున్న సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని మద్దెలకుంటకు చెందిన లలితమ్మకు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో 230212010000430 నెంబరు పొదుపు ఖాతా ఉంది. 9వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటలకు ఆమె ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. ఇక ఆమె మెసేజ్‌లో ఉన్న లింక్‌ను ఓపెన్ చేయగా మొదట దఫా రూ.50 వేలు రెండవ దఫా రూ.19 వేలు ఆమె ఖాతా నుంచి డ్రా అయిపోయాయి. ఖాతాలో నగదు ఖాళీ అయిన విషయాన్ని గుర్తించిన ఆమె లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబర్ నేరగాళ్లు ఇటీవల కొత్త పంథాను ఎంచుకున్నారు. కరెంటు బిల్లుల పేరుతో ఓటీపీలు, మెసేజ్‌లు పంపుతూ ఖాతాల్లోని నగదును స్వాహా చేస్తున్నారని, అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని ఇన్‌చార్జి ఎస్‌ఐ సహదేవి పేర్కొన్నారు.

నీట మునిగిన నగరి

- రాత్రంతా కుండపోత
- పంట పొలాలు, ఇళ్లు జలమయం
- 142.6 మి.మీ వర్షపాతం నమోదు
- కన్నికాపురం వద్ద తెగిన కల్వర్టు


జలమయమైన నగరిపేట ఇందిరమ్మ ఇల్లు

నగరి : ఈ ఏడాది సూర్యుడు ఎంతలా మండిపోయాడో.. వరుణుడు కూడా అదేస్థాయిలో ప్రతాపం చూపించాడు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ప్రజలను భయభ్రాంతుల్ని చేసేలా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కరోజులో ఇంత వర్షం పడిన దాఖలాలు గతంలో ఎప్పుడూ లేవు. అకస్మాత్తుగా కురిసిన వర్షం జనజీవనాన్ని కుదిపేసింది. నగరిలో 142.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చింతలపట్టెడ దళిత వాడ, నగరిపేట ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. నివాసితులు మోకాటి లోతు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని బీరకుప్పం, కన్నికాపురం మార్గంలో కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఈ ప్రాంతాల వారు నగరి పట్టణానికి చేరుకోవాలంటే నీటిలో దిగి నడవడమా లేక పది కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడప్పుడే పోసిన వరినారుమళ్లు, కాస్త ముందుగా వేసుకున్న నాట్లతో పాటు వెదజల్లు సాగు చేపట్టిన చేలు, పలు రకాల పంటలు నీట మునిగాయి. చేలలో హద్దులుగా ఉండే గెనుములు తెగిపోయాయి. స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం జలమయమైంది. ప్రవేశమార్గం నుంచి లోపల వరకు చెరువును తలపిస్తోంది. నగరి, గుండ్రాజుకుప్పం, మాంగాడు, ఇరుగువాయి, ఆరూరు చెరువులు నిండిపోయాయి.


కన్నికాపురం రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు


బీరకుప్పం వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు


చెరువును తలపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

సహజీవనం.. 'తాపీ'గా హత్య

- ప్రియురాలిని పొడిచేందుకు యత్నించిన ప్రియుడు
- అదే కత్తితో ప్రియుడిని పొడిచి చంపేసిన ప్రియురాలు
- విషయం స్థానికులు తెలిసిపోవడంతో పోలీసులకు లొంగిపోయిన వైనం


హత్యకు గురైన మొగిలీశ్వర్

పలమనేరు: సహజీవనం చేస్తున్న వ్యక్తి హత్యకు గురైన సంఘటన సోమవారం పట్టణంలో వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు, పట్టణంలోని కాకాతోపులో ఉండే మొగిలీశ్వర(50) స్థానికంగా తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గంగవరం మండలం వేపనపల్లెకు చెందిన మంగమ్మ(45) సైతం పట్టణంలో తాపీ పనులకు వెళ్లి కుటుంబానికి ఆసరాగా ఉండేది. వీరిద్దరూ కలిసి తాపీ పనులు చేస్తుండడంతో పరిచయం ఏర్పడింది. ఆపై ఇద్దరూ ఇష్టపడి సహజీవనం ప్రారంభించారు. ఇరు కుటుంబాల మధ్య గతంలోనే గొడవలు జరిగాయి. వీరిద్దరూ వారి కుటుంబాలను వదిలిపెట్టి గత కొన్నేళ్లుగా స్థానిక లక్ష్మీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో కాపురముంటున్నారు. ఇటీవల మద్యానికి బానిసైన మొగిలీశ్వర మంగమ్మపై అనుమానంతో తరచూ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి సైతం బాగా తాగి ఇంటికొచ్చిన మొగిలీశ్వర్, మంగమ్మతో గొడవ పడ్డారు. ఆగ్రహించిన మొగిలీశ్వర్ కత్తితో ఆమెను పొడవబోయాడు. అయితే ఆ కత్తిని తీసుకొని మంగమ్మ అతన్నే పొడిచేసింది. తీవ్ర రక్తస్రావంతో ఇంట్లో పడి ఉన్న అతడిని కాసేపు పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో అతను మృతి చెందాడు. ఆపై రక్తపు మరకలున్న కత్తిని శుభ్రం చేసింది. మృతుడి దుస్తులు విప్పి ఉతికేసింది. ఈ విషయం చుట్టుపక్కల వారికి తెలిసిపోవడంతో, నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. దీంతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఒంటరిగా జీవించలేక ఆత్మహత్య

కార్వేటినగరం: ఒంటరి జీవనాన్ని భరించలేక మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. చాకలివాని గుంట ఎస్టీ కాలనీకి చెందిన వరలక్ష్మి(42) భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలి కుమారుడు శ్యామ్ గోవాలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఒంటరిగా ఉన్న వరలక్ష్మి నాలుగు రోజుల క్రితం మామిడి తోటలో ఉరివేసుకుని మృతి చెందింది. వరలక్ష్మి కనిపించడం లేదని ఆమె సోదరుడు మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని మామిడి తోటలో మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారమందుకున్న మనోహర్ సంఘటనా స్థలానికి చేరుకుని మహిళ ధరించి ఉన్న దుస్తులను బట్టి వరలక్ష్మిగా గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మునికృష్ణ తెలిపారు.

సర్వేలో భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు నైబర్‌హుడ్ సర్వేలో తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని డీఆర్‌డీఏ పీడీ తులసి చెప్పారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలోని స్వయం సహాయక సంఘాల జీవనోపాధి పెంపు కోసం నైబర్‌హుడ్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ప్రతి ఒక్క సభ్యురాలు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలు చదువుకొని ఉపాధి అవకాశాలు లేక జీవనం గడుపుతున్నవారికి ఇదొక మంచి అవకాశమన్నారు. విద్యార్హతను బట్టి ఇంటివద్దనే ఎంచుకున్న వృత్తిలో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్హతలు ఉండి ఇంటి వద్ద ఉన్నవారికి కాల్ సెంటర్లు, వ్యవసాయ, వ్యవసాయేతర, కుటీర పరిశ్రమలు, ఫుడ్ సెక్టార్, చేతివృత్తులు తదితర రంగాల్లో ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఎంచుకున్న రంగాల్లో ఇంటి వద్దనే పని చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని పీడీ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో సంఘమిత్రల ద్వారా నైబర్‌హుడ్ సర్వే కొనసాగుతోందని చెప్పారు.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం


జగదీష్ (ఫైల్)

సదుం: బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, తిమ్మానాయనపల్లె పంచాయతీ అగ్రహారానికి చెందిన సుబ్రమణ్యం వీఆర్‌ఏగా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు జగదీష్(24) బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి సొంత పనుల నిమిత్తం బైక్‌లో వస్తుండగా కారు ఢీకొనడంతో మృతి చెందారు. అతని అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

600 మందికి ఒకే హిందీ టీచర్


ఎంఈఓ శ్రీదేవికి వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

నగరి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటుపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ సర్దుబాటు ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని వెంటనే దీనిని రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తూ స్థానిక ఉపాధ్యాయ సంఘాలు నగరి పట్టణంలో ఎంఈవో శ్రీదేవికి సోమవారం వినతిపత్రం సమర్పించాయి. యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ గుదిబండగా మారిందన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 600 మంది విద్యార్థులకు ఒకే హిందీ టీచర్‌ను నియమించారని, ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు సబ్జెక్టులు ఉన్న సోషియల్ స్టడీస్‌లో 260 మందికి ఒకే సోషియల్ టీచర్‌ను ఉంచారని, ఇలా ప్రతి పాఠశాలలోను అడ్డగోలు సర్దుబాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాలతో భౌతిక సమావేశం నిర్వహించి అసమానతలను తొలగించాలని కోరారు. ప్యానల్ నంబరును గానీ ర్యాంక్‌నుగానీ పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని లేకుంటే బహిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు నాగభూషణం, నాగరాజరెడ్డి, జనార్ధన్, కన్నెప్ప పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం

చిత్తూరు కలెక్టరేట్ : ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, వివరాలను పొందేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1097 అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ నంబర్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మీకు తెలుసా పేరుతో అవగాహన కార్యక్రమం చేపడుతున్నారన్నారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ప్రతి గర్భిణీకి మొదటి మూడు నెలల్లోనే హెచ్ఐవీ పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్, డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

25న తెలుగు వైభవం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రచయితలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలిపే 'తెలుగు వైభవం' కార్యక్రమాన్ని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎం.వి.కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న చిత్తూరులో నిర్వహించనున్నట్లు ఎంవీ శ్రీధర్ రెడ్డి, మర్రిపూడి దేవేంద్రరావు, నారాయణస్వామి తెలిపారు. చిత్తూరు నగరంలోని రచయితల సమాఖ్య కార్యాలయంలో వారు సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి శతాధిక తెలుగుకవి సమ్మేళనం తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (మారిషస్)లో నమోదు కానుందన్నారు. కార్యక్రమంలో కోటీశ్వర మొదలియార్, కె.ఆనందనాయుడు, జి.భూపతి, తోట గోవిందన్, వి.రఘుపతి, డా.రాజు, కె.ఇ.అన్నారావు, సీఏ జై కేశవసింగ్, రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 200 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



సమస్యను వెల్లడిస్తున్న రమణయ్య.

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 166, నేషనల్ హైవే 6, సర్వే శాఖ 3, పోలీస్ శాఖ 1, డీఎస్ఓ 1, జిల్లా అటవీశాఖ 1, చిత్తూరు మున్సిపాలిటీ 1, నగరి మున్సిపాలిటీ 1, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ 3, పశు సంవర్ధక శాఖ 1, ఏపీఎస్‌పీడీసీఎల్ 1, ఎస్ఈ, పంచాయత్ రాజ్ 1, దేవదాయ శాఖ 1, భూగర్భ గనుల శాఖ 1, డీఎంఅండ్‌హెచ్ఓ (వైద్య శాఖ)1, డీఆర్‌డీఏ 5, డ్వామా 2, మెప్మా 2, డీపీఓ 1, స్కిల్ డెవలప్‌మెంట్ 1 మొత్తం 200 అర్జీలు అందినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించడయ్యా అంటూ పెనుమూరు మండలం కలవగుంట పంచాయతీ విజయనగరం యానాది కాలనీ ప్రజలు వాపోయారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ గ్రామానికి చెందిన రమణయ్య మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం నిర్మించిన నీటి ట్యాంక్ మరమ్మతులకు గురైందన్నారు. మండల అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. గత్యంతరం లేక ప్రైవేట్ ట్యాంకులలో నీటిని కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యలోపం ఎక్కువగా ఉందన్నారు. డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వ్యాధులు సంక్రమిస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అమరరాజ ఆధీనంలో మా భూములు



అమరరాజ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్న మా భూముల్ని ఇప్పించాలని చిత్తూరు మండలం ఏనుగుండ్ల పల్లె ఎస్సీ కాలనీకి చెందిన బాధితులు వాపోయారు. బాధిత మహిళ సాలమ్మ మాట్లాడుతూ తమకు జీవనాధారమైన భూమి చిత్తూరు, యాదమరి మండలం సరిహద్దులో ఉందని తెలిపారు. తన భూమితో పాటు మృతి చెందిన వనమ్మకు చెందిన భూమిని ఫ్యాక్టరీ వాళ్లు ఆక్రమించుకున్నారన్నారు. తాను అంతగా చదువుకోకపోవడంతో సంతకాన్ని ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను తారుమారు చేశారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించడం లేదని తెలిపారు.

గృహాలు కూలే స్థితిలో ఉన్నాయయ్యా


సమస్యను వెల్లడిస్తున్న బాధితులు శైలు, అరుణ్‌లు

తమ గృహాలు కూలే స్థితిలో ఉన్నాయయ్యా అంటూ యాదమరి మండలం కినాటం పల్లి పంచాయతీ శికారుకాలనీకి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధితులు శైలు, అరుణ్ మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం నిర్మించిన గృహాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. అవి ఎప్పుడు పడిపోతాయోనన్న భయంతో రోజు రోజుకు బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నామన్నారు. అధికారులు స్పందించి తమకు పక్కా గృహాన్ని మంజూరు చేయాలని కోరారు.

టీటీడీకి కూరగాయల వితరణ


వాహనంలో కూరగాయలు నింపుతున్న సిబ్బంది

పలమనేరు: టీటీడీలో నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణం నుంచి పది టన్నుల కూరగాయలను స్థానిక శ్రీవారి సేవకులు టీటీడీ వాహనంలో సోమవారం తిరుమలకు తరలించారు. వీటిని కర్ణాటక రాష్ట్రం కోలారు ఎమ్మెల్యే మంజునాథ్ సొంత డబ్బుతో కొని పంపినట్లు స్థానిక నిర్వాహకులు రవీంద్రారెడ్డి తెలిపారు.